# జన్మతః లోపాలు-ప్లాస్టిక్ సర్జరి

" జన్మతః వచ్చే అంగవైకల్యాల వల్ల చాలామంది ఆత్మన్యూనతా భావానికి గురి అవుతారు. ప్లాస్టిక్ సర్జరీ వారిలోని ఆత్యన్యూనతా భావాన్ని తొలగిస్తుంది. అంగవైకల్యాన్ని తొలగిస్తుంది'' అని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డా॥ఎ.రవికుమార్ పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం డా॥సమరం అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని "జన్మతః లోపాలు-ప్లాస్టిక్ సర్జరి'' అంశంపై ప్రసంగించారు. డా॥ఎ.రవికుమార్ మాట్లాడుతూ జన్మతః వచ్చే అంగవైకల్యాలు కొన్నింటికి జీన్స్ లోపం కాగా, పౌష్టికాహారం లోపం మరికొన్నింటికి కారణం. వాతావరణం కాలుష్యం కూడా పిండంపై దుష్పరిణామాలు చూపించి అంగవైకల్యాలని కలిగిస్తుందన్నారు. పుట్టుకతో అంగవైకల్యాలకి మేనరిక వివాహాలు ఒక ప్రధాన కారణమన్నారు. గర్భిణీ స్త్రీకి కలిగే రకరకాల వైరల్ వ్యాధులు గర్భస్థ శిశువుకి అంగవైకల్యాన్ని కలిగించే అవకాశం ఉందన్నారు. డాక్టరు సలహా లేకుండా గర్భిణీ స్త్రీ వాడే కొన్ని మందులు కూడా పిండం మీద చెడు ప్రభావం చూపించి జన్మతః కలిగే అంగవైకల్యాలకి కారణం అవుతాయన్నారు. రేడియేషన్ కూడా జన్మతః కలిగే అంగవైకల్యాలకి కారణం అన్నారు. గర్భిణీ స్త్రీ మంచి పౌష్టికాహారం తీసుకుంటే జన్మతః వచ్చే అంగవైకల్యాలని నివారించవచ్చన్నారు. జన్మతః వచ్చే అంగవైకల్యాల నివారణలో జెనిటిక్ కౌన్సిలింగ్, గర్భధారణకి ముందు కౌన్సిలింగ్, ఆహార విజ్ఞానం, అంటు వ్యాధుల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు చాలా వరకు తోడ్పడతాయన్నారు. జన్మతః అంగవైకల్యాల ఒకటిగాని, అంతకన్నా మించిగాని ఉండవచ్చన్నారు. జన్మతః కలిగే అంగవైకల్యాలు కొన్ని పైకి కనిపించేవి కాగా మరికొన్ని పైకి కనిపించకుండా గుండె, ఊపిరితిత్తులు, ప్రేగులు, మూత్రపిండాలు, నాడీ వ్యవస్థకి సంబంధించి ఉంటాయన్నారు. పెదవి చీలడం, అంగిలి చీలడం, కొందరికి పుట్టుకతో ఉంటాయని, వాటిని గ్రహణం మొర్రిగా భావిస్తారని అన్నారు. జన్మతః వచ్చే ఏ అంగ వైకల్యానికి గ్రహణాలు కారణం కాదని, గ్రహణం మొర్రి అనేది అపోహ తప్ప, గ్రహణానికి అంగవైకల్యాలకి సంబంధం లేదని అన్నారు. ఆరువేళ్ళు ఉండటం, గ్రహణం మొర్రి, పెద్ద పుట్టు మచ్చలు, డొప్ప చెవులు ఇవన్నీ అదృష్ట సూచికలని అనుకుంటారని, అవన్నీ అశాస్త్రీయ ధోరణులు తప్ప నిజం కాదన్నారు. జన్మతః వచ్చే అంగవైకల్యాలని అభివృద్ధి చెందిన ప్లాస్టిక్ సర్జరీతో సరిదిద్దితే వ్యక్తిలో పని నైపుణ్యాన్ని పెంచడమే కాకుండా ఆత్మన్యూనతః భావాన్ని తొలగించవచ్చన్నారు. డా॥రవికుమార్ తమ సోదాహరణ ప్రసంగంలో ప్లాస్టిక్ సర్జరీ ద్వారా జన్మతః కలిగిన అంగవైకల్యాలని ఏ విధంగా సరిదిద్దడం జరిగిందో స్లైడ్‌ల ద్వారా ప్రదర్శించి చూపించారు.